క్లుప్తంగా

బీమాతో ఆర్థిక ఆసరా



లబ్ధిదారు రామమ్మకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ శోభ

కూనవరం: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు కూనవరం బ్రాంచ్ మేనేజర్ శోభ అన్నారు. మండల పరిధిలోని పలూరు గ్రామానికి చెందిన మడకం రాజు గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో చేరడంతో రూ.2 లక్షల బీమా మంజూరైంది. ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును ఏపీజీవీబీ మేనేజర్ శోభ మంగళవారం మృతుడి భార్య రామమ్మకు అందజేసింది. బీమా పథకంలో ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ఐరిక్స్ ఆపరేషన్ మేనేజర్ కేసుపాక రవికుమార్, ఛానల్ మేనేజర్ బయ్యారపు నారాయణ, పల్లూరు వీవో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాలమ్మ జాతర ఉత్సవాలు



పట్టాలమ్మ అమ్మవారు

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామ దేవత పట్టాలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. దాదాపు వందేళ్లుగా గ్రామస్తులు ఈ అమ్మవారి జాతర జరుపుకోవడం ఆచారంగా వస్తోంది.అమ్మవారి ఘటం ఊరేగింపు ఘనంగా జరిగింది. గ్రామంలో అంటు వ్యాధులు సోకకుండా కాపాడాలని, ప్రకృతి విపత్తుల నుంచి గ్రామాన్ని రక్షించాలని, పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకొంటు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు, పూలు, పండ్లు, టెంకాయలు సమర్పించి, దీపదూప నేవేధ్యాలతో గ్రామస్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకొన్నారు.

మ్యుటేషన్‌పై అవగాహన



లబ్బంగిలో రైతులకు మ్యుటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మ్యుటేషన్స్ పై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు.మండలంలో లంబసింగి పంచాయితీ లబ్బంగి గ్రామంలో సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు రైతులతో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి హక్కు చేయించుకోవడం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టం, పంట బీమా, పంట రుణ సదుపాయం, ఆర్థిక లాభాలు పొందేందుకు మ్యుటేషన్ అవసరమన్నారు. మ్యుటేషన్ అవశ్యకతను వివరించి, దరఖాస్తు విధానాన్ని వివరించినట్టు చెప్పారు. వీఆర్వో భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం రద్దు



సమావేశానికి సభ్యుల కోసం నిరీక్షిస్తున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: మండల సర్వసభ్య సమావేశానికి కోరం లేక రద్దు చేసినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రారంభమైంది.సమావేశనికి వివిధ శాఖల అధికారులు, కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. సభను ప్రారంభించేందుకు ఎంపీడీవో కోరం సంతకాలు చేయాలని కోరారు. మండలంలో 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా సభ ప్రారంభించేందుకు 10 మంది హాజరుకావాల్సింది. అయితే సభకు కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కావడంతో సభ్యుల కోసం రెండు గంటల పాటు అధికారులు, సభాధ్యక్షులు నిరీక్షించారు.12 గంటల వరకు కోరంనకు తగ్గ ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, ఈవోఆర్‌డీ పాపారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

- వాతావరణం అనుకూలం
- జోరుగా ఖరీఫ్ పనులు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- ఆనందంలో రైతులు



రమేష్‌నాయుడు, మండల వ్యవసాయాధికారి

రాజవొమ్మంగి: ఏజెన్సీ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. వేసవి దుక్కులు దాదాపు పూర్తయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు చేరింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో సాగు పనులకు రైతులు సన్నద్ధమయ్యారు. వరి పంట సాగు కోసం ఇప్పటికే దుక్కి పనులు జోరుగా చేపడుతున్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పొలాల్లో ఇప్పటి నుంచే పచ్చిరొట్ట చేలు పెంచేందుకు రైతు నేలను సిద్ధం చేస్తున్నారు.

పచ్చిరొట్టతో భూసారం వృద్ధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలను అందజేస్తోంది. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. మండలంలోని సుమారు 5 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కోసం అవసరముందని, ఈ మేరకు ఇండెంట్ పెట్టామని మండల వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు చెప్పారు. ఈ విత్తనాలను ఎకరాకు 10 కిలోల చొప్పున పొలంలో వెదజల్లి ఏపుగా పెరిగిన 40 రోజులకు నేలలో కలియదున్నాలన్నారు. దీని వలన పంటకు కావాల్సిన నత్రజని పంట కాలం అంతా సమకూర్చడంతో భూసారం వృద్ధి చెందుతుందన్నారు. తద్వారా రసాయన ఎరవుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని, మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మండలంలో వరి సాగు విస్తీర్ణం 5,500 ఎకరాలు

మండలంలో ఈ క్రాపు ప్రకారం 5, 500 ఎకరాల్లో వరి సాగవుతున్నట్టు ఏఓ రమేష్‌నాయుడు చెప్పారు. గత ఏడాది 1450 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు 90 శాతం సబ్సిడీపై సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 1300 క్వింటాళ్ల వరి విత్తనాల అవసరమున్నట్టు ఇండెంట్ పెట్టామన్నారు. ఈ విత్తనాలు 4,300 ఎకరాల్లో సాగుకు సరిపోతాయన్నారు. త్వరలోనే వరి విత్తనాలు చేరుతాయని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలకే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు సరఫరా చేస్తున్న వరి వంగడాల్లో ముఖ్యంగా ఎంటీయూ–1061, ఎంటీయూ–1318, ఎంటీయూ–1121, ఎస్‌ఎల్‌ఆర్ 34449, ఎంటీయూ 1064 రకాలు ఉన్నట్టు చెప్పారు.

విస్తారంగా వర్షాలు

మే నెలలో ఏజెన్సీ వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మరో వారం రోజుల్లో నారుమడులు వేసుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వర్షాధారంగానే పంటలు

మండలంలో వరి తదితర పంటలు ప్రధానంగా వర్షాధారంగానే సాగవుతున్నాయి. కాగా మండలంలోని వట్టిగెడ్డ రిజర్వాయర్, మడేరు ఆనకట్ట దిగువన దాదాపు 3, 500 ఎకరాలకు సాగునీరందుతోంది. అయితే వీటి పంటకాలువల పూడికతీత పనులు పూర్తికాక ఆయకట్టు శివారు భూములకు సాగునీరు అతి కష్టం మీద చేరుతోంది.

వాణిజ్య పంటలపై దృష్టి

ఈ ఏడాది గతంలో కంటె ఎక్కువగా రైతులు వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. వీటిలో ప్రధానంగా పత్తి, పొగాకు, అరటి పంటలు ఉన్నాయి. పశువులు ముట్టని పొగాకు పంట మండల వ్యాప్తంగా 2వేల ఎకరాల్లో సాగవుతోంది. ఎకరాకు కనీసం రూ. 50,000 నికరాదాయం సమకూరుతుండటంతో ఈ పంటపై రైతులు ఆధారపడుతున్నారు.

గిట్టుబాటు ధరతో ఆనందం



ఎన్నిరకాల పంటలు ఉన్న తిండిగింజల కోసం వరినే ఎక్కువగా పండిస్తాం. మా అవసరాలకు సరిపడా నిల్వ చేసుకొని మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నాం. వరికి గతంలో కంటే గిట్టుబాటు ధర లభిస్తోంది. ధాన్యం రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయిస్తుండగా సకాలంలోనే సొమ్ములు చేతికి వస్తున్నాం. సబ్సిడీపై వరి విత్తనాలు, రైతు భరోసా సొమ్ములు సకాలంలో అందుతుండడంతో పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల చుట్టు తిరగాల్సిన వెతలు తప్పాయి. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం ఎరువులు, సేంద్రియ పురుగు మందులను సరఫరా చేసోంది. వ్యవసాయాన్ని పండగలా మార్చిన జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కేదారి బెన్నయ్య,
గిరిజన రైతు. అప్పలరాజుపేట



రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోని నిండుగా నీటితో ఉన్న వట్టిగెడ్డ రిజర్వాయర్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు



రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష

జి.మాడుగుల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 ఇంటర్‌లో ప్రవేశాలు జరుగుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గౌరీప్రసాద్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులున్నాయన్నారు. ప్రవేశం కోరే విద్యార్థులు కళాశాలలో సర్టిఫికేట్లు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని ఆయన తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందే విద్యార్థులు టెన్త్ ఉత్తీర్ణత పత్రం, టీసీ, స్టడీ, కాండక్ట్ సర్టిఫికెట్లు, హాల్ టికెట్, విద్యార్థి, తల్లి బ్యాంక్ పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, విద్యార్థి, పేరెంట్ సెల్ నంబర్లు, విద్యార్థి ఈ–మెయిల్ ఐడీ, విద్యార్థి పాస్‌పోర్టు సైజు ఫోటోలు–4, ధ్రువపత్రాలు మూడు సెట్‌లు జెరాక్స్ కాపీలతో కాలేజీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీలకు ప్రవేశరుసుం రూ.2209 కాగా సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు రూ.1309 చెల్లించాలని పేర్కొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రావి శిరీష కోరారు. ఈ కళాశాలలో జనరల్, ఒకేషనల్ గ్రూపులు ఉన్నట్టు తెలిపారు. సైన్స్ గ్రూపులకు చెంది ఎంపీసీ, టీఐఎం/ఈఎం, ఆర్ట్స్ గ్రూపుల్లో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్టు పేర్కొన్నారు. కళాశాలలో ప్రవేశం పొందిన వారికి బాలురకు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం ఉన్నట్టు చెప్పారు. పది ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ శిరీష సూచించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

గంగవరం : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలను మంగళశారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. నెల్లిపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. అర్జున, ప్రభ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పాక దగ్ధం

- కాలిన రెండు బైక్‌లు, సైకిల్



దగ్ధమైన బైకులు, సైకిల్

అడ్డతీగల: అడ్డతీగల మండలం బందమామిళ్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పాక దగ్ధమైంది. ఈ సంఘటనలో రెండు మోటారు సైకిళ్లు, ఒక సైకిల్ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎస్.అంజిబాబుకి చెందిన మోటార్ సైకిల్, మరొక వ్యక్తి సీహెచ్.వెంకన్నబాబుకు చెందిన బైక్‌తో పాటు ఒక సైకిల్ మంటల్లో కాలిపోయాయి. కాగా ఈ సంఘటనపై బాధితులు దుచ్చెర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదలపై అప్రమత్తం



సమావేశంలో మాట్లడుతున్న ఎంపీడీవో మురళీకృష్ణ

ఎటపాక: గోదావరికి వరదలు వస్తే అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఇటీవల హత్యకు గురైన కన్నాయిగూడెం ఎంపీటీసీ వర్సా బాలకృష్ణ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీడీవో మురళీకృష్ణ మాట్లాడారు. వరదలకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను, సహాయక చర్యలను వివరించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వరదలను సమర్ధంగా ఎదుర్కోవాలన్నారు. బఫర్ స్టాక్‌లు, బోట్ల ఏర్పాటు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదల సమయంలో ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు చేరవేయాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ వేగవంతం



జర్జులలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ వేగవంతం చేసినట్టు మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు చెప్పారు. మండలంలోని జర్జుల పంచాయ కేంద్రంతో పాటు సోబలడ, సిరగంపుట్టు గ్రామాల్లో మలేరియా మందు పిచికారీను మంగళవారం చేశారు. ఆయా గ్రామాల్లో గిరిజనులకు మలేరియా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఈ నెల 30తేదీ లోగా మొదటి విడత మలేరియా పిచికారీ పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. మండలంలో కిలగాడ, లబ్బూరు పీహెచ్‌సీ పరిధిలో 128 గిరిజన గ్రామాల్లో పిచికారీ పనులకు గాను 116 గ్రామాల్లో ఇప్పటికే పిచికారీ పూర్తి చేశామని, మిగిలిన 12 గ్రామాల్లో త్వరలో పూర్తిచేస్తామన్నారు. ప్రతి ఇంట్లో దోమల మందు పిచికారీ చేసుకోనే విధంగా అవగాహన కల్పించామని, గిరిజనులందరూ సహకరించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్‌లు ప్రదీప్, నాగరాజు, మోహన్, జర్జుల పంచాయతీ కార్యదర్శి చంద్రకాత్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం



అరకు–పాడేరు మార్గంలో తెగిపోయిన బీఎస్ఎన్ఎల్ కేబుల్

అరకులోయటౌన్: అరకులోయ పరిధిలోని గత మూడు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థ పనిచేయక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకులోయ జేటీవో పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో 7 సెల్‌టవర్లు ఉన్నాయి. వీటి పరిధిలో బీఎస్ఎన్ఎల్ సెల్ వినియోగదారులతో పాటు సుమారు 900 మంది ఫైబర్ నెట్ వినియోదారులున్నారు. బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ సేవలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. అరకులోయ–అనంతగిరి, అరకులోయ–పాడేరు మార్గంలో పలుచోట్ల వైర్లు తెగిపోవడం వలన సమస్య తలెత్తుతోందని, వాటిని సరిచేయకపోవడమే కారణమని చెబుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



పీహెచ్‌సీ వద్ద మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది

మారేడుమిల్లి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మారేడుమిల్లి సర్పంచ్ కొండా జాకబ్, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది మొక్కలు నాటారు. పీహెచ్‌సీ డాక్టర్లు హరికృష్ణ, రాణీ శిరీష, బోదులూరు పీహెచ్‌సీ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రాజుపేటకు చెందిన భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. రాజుపేటకు చెందిన భీశెట్టి వెంకటరమణ భార్య, కుమారుడితో కలిసి విశాఖపట్నం వెళుతున్నారు. అనకాపల్లి మెయిన్‌రోడ్డు డైట్ కళాశాల వద్ద బైక్‌పై వెళుతున్న భార్యభర్తలను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరమణకు, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాబు సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సమస్యలపై వినతి



ముంచంగిపుట్టులో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న మినుములపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయితీ మినుములపుట్టు గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాల పరిపాలన అధికారి సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. మినుములపుట్టులో తాగునీటి పథకం లేక అవస్థలు పడుతున్నామని, నీటి కోసం దూరం వెళ్లాల్సి వస్తోందని, సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఈశ్వరి, రాజేశ్వరి, భానుమతి, రోహిణి, లీలావతి, సుందరమ్మ, రత్నలమ్మ తదితరులు కోరారు.

విద్యుత్ సౌకర్యం కోసం వినతి

ఎటపాక: మండలంలోని ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి కోరారు. ఈ మేరకు నెల్లిపాక రేంజర్ మూర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ లేక ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. సమస్యలను స్పందించి వెంటనే అనుమతులు ఇచ్చి విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



సుండ్రు చిన్నబ్బాయి, మాజీ సర్పంచ్

చింతపల్లిరూరల్: అల్లూరి జిల్లాలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం అని అన్నవరం మాజీ సర్పంచ్ సుండ్రు చిన్నబ్బాయి అన్నారు. జూన్ 4వ తేదీన వెలువడుతున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పాడేరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి విజయం సాధించడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో వచ్చిన మేజార్టీని మించి ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ముఖ్య కారణం జగనన్న చేసిన అభివృద్ధి, పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలేనని స్పష్టం చేశారు.

ఘనంగా అమ్మవారి పండగ

మునగపాక : అరబుపాలెం యాతపేటలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ జాతర

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.వేకవ జాము నుంచి భక్తులు అమ్మవార్ని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. గ్రామ శివారు తోటలో కొలువు తీరిన అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలు సమర్పించగా , అన్నదాతలు రైతులు మొక్కులు చెల్లించుకుని , పొలాల్లో పండిన ఫల సాయాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో 9 రోజులు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి వైభవంగా ఊయల సంబరం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

త్రిపురాంతకస్వామికి పుష్పాంజలి



ప్రత్యేకాలంకరణలో త్రిపురాంతకస్వామి, సర్వ మంగళాంబల విగ్రహాలు

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామికి మంగళవారం రాత్రి కన్నుల పండువగా పుష్పాంజలి నిర్వహించారు. ఈ నెల 23న స్వామి కల్యాణోత్సవాన్ని భారీగా జరిపిన విషయం తెలిసిందే. ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించే పుష్పాంజలి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, మల్లెపూల మాలలతో అందంగా అలంకరించారు. పలు రకాల తీపి పదార్థాలు, పండ్లు, ఇతర పదార్థాలు, పాలు, సుగంధ ద్రవ్యాలు నివేదించి, పూజలు చేశారు. ఊయలలో కల్యాణ మూర్తులను నిలిపి లాలించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పాటలు పాడారు. మంగళవారం ఉదయాన్నే స్వామి మూల విరాట్‌ను, అమ్మవారిని అందంగా అలంకరించి తొలుత పూజలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు. స్థానిక విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో భక్తులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



కిల్లంకోటలో స్థానికులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

జి.మాడుగుల: ఎన్నికల కౌంటింగ్ రోజున అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని సీఐ రమేష్ తెలిపారు. మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కిల్లంకోట పంచాయతీ కేంద్రంలో మంగళవారం ముందస్తు ఎన్నికల నిబంధనలపై గిరిజన ప్రజలకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు జరిగే ప్రదేశంలో 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఎన్నికల నియమావళిని పాటించాలని లేని పక్షంలో కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. పంచాయతీలో ప్రజలు గుంపులుగా ఉండడం, జనాలను తరలించడం, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు పనుల సమస్య సంబధిత అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు త్వరితగతిన పూర్తి చేయటానికి తగిన చర్యలు చేపడుతామని ఆయన చెప్పారు.

దేవీపట్నం : కౌంటింగ్ కేంద్రాలకు ఎవరూ వెళ్లొద్దని పోలీసులు అవగాహన కల్పించారు. ఇందుకూరుపేటలో మంగళవారం ఉదయం సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్సై నాగార్జున లు అవగాహన కల్పించారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా 144 సెక్షన్, అమల్లో ఉందని,, అనుమతి పొందిన ఏజెంట్‌లు తప్ప ఎవరినీ అనుమతించేది లేదన్నారు. ప్రతి మండలంలో పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. బాణసంచా, ఊరేగింపు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు.